


# అపుత్రస్య....

ఉషాకిరణ్ * ఆర్టీమూర్తి

'ఛీఛీ.... ఈసారికూడా ఆడపిల్లేనా...

అవున్లే దరిద్రుడు తల కడగబోతే వడగళ్ళవాన కురిసిందని... నాలాంటివాడికి ఎంతమంది పుట్టినా అందరూ ఆడదెయ్యాలేగానీ ఒక్క మగవెధవా పుట్టడు.

పోనీ ఈసారైనా ఒక్కడు... ఒక్కడంటే ఒక్క మగనలుసు పుట్టగూడదూ! మేమేదో తిని ఏడుస్తున్నామని తనూ తినాలని పుట్టింది మరో మహమ్మారి ఆడగుంట. అసహనంగా అటూ యిటూ వరండాలో తిరుగుతూ ఆలోచించసాగేడు మధు. అతని చేతిలో అప్పుడే వచ్చిన టెలిగ్రామ్ వుంది.

ఆ ఆచార్లు పదిరూపాయలు దక్షిణా కొట్టేసి, "ఈసారి తప్పకుండా వంశోద్ధారకుడేనోయ్ పుట్టేది" — అని చెప్పినపుడు తనెంత సంతోషించాడు? వాగు పదిరూపాయలకోసం ఎన్ని మీనమేషాలు లెక్కబెట్టేడు? వెధవశాస్త్రం యెందుకు? తగలెయ్యనా? వంశోద్ధారకుడుకాదు వంశోద్ధారకురాలు పుట్టింది.

ఆ కోయసన్నాసి మాత్రం తక్కువతిన్నాడా? చేయి అటు తిప్పి, యిటు తిప్పి అరగంట చూసి, "పోతుకూనే దొరా... ఈసారి తప్పదు ఈ కొండదొర వాక్కు... వుంజే పుట్టబోయేది." అంటే నిజమేననుకొని సంబరపడిపోయి వాడి చేతిలో ఐదురూపాయలు పెట్టడమేగాకుండా గట్టి చిరుగుల్లేని చొక్కా కూడా యిచ్చాడే తను. దరిద్రపు వెధవలు... భుక్తికోసం యెన్ని అబద్ధాలయినా చెబుతారు.

అయినా ఒకళ్ళననుకొని ఏం లాభం? తన ప్రారబ్ధం యిలా వుంటే! యెవడుమాత్రం ఏం చెయ్యగలడు? యెవడి పొట్టతిప్పలు వాడివి.

ఇంతకీ ఆ టెలిగ్రామ్‌లో సంగతి నిజమేనా? నిజంగా తనకు ఆడపిల్లేనా పుట్టింది? కొంపతీసి తనను ఏడిపించడానికి బావమరిదిగాని అలా యివ్వలేదుకదా? అబ్బే తనతో ఈ విషయంలో సరసాలాడే ధైర్యం వాళ్ళకెక్కడిది?

అందులోనూ సావిత్రిని పురిటికని పుట్టింటికి పంపేనాడే ఖచ్చితంగా చెప్పేడు తను. "ఈసారి తప్పకుండా మొగపిల్లవాడినే కనాలి. ఆడపిల్లను కన్నావో నీ ముఖంగానీ, దాని ముఖంగానీ చస్తే చూడను. ఇక మీరు అక్కడ చావాల్సిందే. ఇక్కడకు తీసుకువచ్చే ప్రసక్తేలేదు." — అని.

ఆ మాటలకు సావిత్రి హడిలిపచ్చింది. దాని కళ్ళల్లో నీళ్ళు సుళ్ళుతిరగడం తను చూడకపోలేదు. భార్య అంటే తనకు ప్రేమ లేకాకాదు...భార్యను ఏడిపించడం తనకు ముచ్చటాకాదు. తనేం చేయగలడు? తన పరిస్థితి అలాంటిది.

తన తాతకు తండ్రి ఒక్కడే సంతానం. తన తల్లితండ్రులకు తానొక్కడే వంశోద్ధారకుడు. ఇక తనకు ఒక్క మగపురుగైనా పుట్టకపోతే తమ వంశం తనతో అంతరించిపోవల్సిందే.

సావిత్రి మొదట నీళ్ళుపోసుకున్నప్పుడే మొగపిల్లడనుకొన్నాడు తను. ఆడబిడ్డ పుట్టింది. మొదట ఆడబిడ్డ శ్రీమహాలక్ష్మి అన్నారందరూ. పోనీలే ఈసారైనా మొగవెధవ పుట్టకపోడు అనుకొన్నాడు. రెండు, మూడు కాన్పులు కూడా ఆడముండలే పుట్టేరు.

కనీసం నాలుగోసారన్నా మొగసన్నాసి పుడ్తాడనుకొని ఆశతో వుంటే చావుకబురు చల్లగా వచ్చింది. మళ్ళీ ఆడపిల్ల... మధు మనసంతా వికలమైపోయింది.

ఇంతలో అతని తండ్రి రంగనాధంగారొచ్చారు. వస్తూనే, "ఏమిట్రా అలాగున్నావు? ఆ చేతిలో ఏమిటి టెలిగ్రామ్‌లాగుంది. కోడలుగానీ ప్రసవించిందా?" — అన్నాడాయన ఆతురతగా.

"ఆ... ఆఁ... ప్రసవించింది. గొప్ప నిర్వాకం చేసింది. చదివి ఆనందించండి." — తన అక్కసువంతా వెళ్ళబోసుకొంటూ టెలిగ్రామ్ తండ్రి చేతిలో కుక్కేడు.

కళ్ళజోడు సవరించుకొని కాగితం మడతలు విప్పి చదివారాయన.

"బ్లెస్సెడ్ విత్ డాటర్. మదర్ అండ్ బేబీ సేఫ్" — అని వుంది అందులో. ఆయన ముఖంలో రంగులు మారేయి.

"అయిందీ...ఈసారీ ఆడపిల్లే... ఏం ఖర్మరా యిది? ఒరేయ్ మధూ... ఇక నీకు మొగపిల్లలు పుట్టే యోగం లేదేమోరా! నాకు నువ్వొక్కడివే. నీతో ఈ వంశం...ప్చ్...ఏం చేస్తాం? ఏ జన్మలో చేసుకొన్న పాపమో..." — అన్నారాయన బాధపడుతూ.

ఈ మాటలు వింటూనే లోపలినుండి దూసుకువచ్చింది తల్లి శాంతమ్మ. "నాయనా యింకా ఎంతమందిని కనినా అంతా ఆడముండల్నే కనేటట్టుందిరా నీ పెళ్ళాం... అయినా చేసుకొన్నోళ్ళకు చేసుకొన్నంత మహదేవా అని. ఊరికే అన్నారా? తక్కువ నోములునోచి ఎక్కువ ఫలం కావాలంటే ఎక్కడనుండొస్తుందిరా? ఈ యింట్లో ఒక్క మగముండావాడు బుడి బుడి నడకలు నడిచే యోగంలేదురా" — అంది శాంతమ్మగారు. ఆ మాటలకు మధు అసహనంతో వూగిపోయాడు.

"అమ్మా... నా ఖర్మ ఎలా వుంటే అలా జరుగుతుంది. ఊరికే మీరు బాధపడి నన్ను బాధపెట్టకండి" — కసురుకొన్నట్లు అన్నాడు. కొడుకు అంత కోపంగా అనేసరికి ఆవిడ తెల్లబోయింది.

"ఇదేం చోద్యంరా నాయనా... ఆడపిల్లను కన్నది నీ పెళ్ళాం... దానిమీద విసుక్కోవాలిగానీ, కన్నతల్లిని నేనేం చేశానురా నిన్ను? అవున్లే అందుకనే అన్నారు పెళ్ళాంఅంటే బెల్లంలాంటిదని. దానిమీద ఈగ కూడా వాలనియవు. అయినా ఇంతకీ నేను కానిమాటేమన్నాను?" — అందావిడ కొంచెం స్వరం పెంచి సాగదీసినట్టు.

"అమ్మా నీకొక దణ్ణం. అసలే నా మనసు బాగోలేక నే నేడుస్తున్నాను. దానికితోడు ఈ గొడవొకటి. నన్ను సుఖంగా బ్రతకనిచ్చేటట్టు లేరు మీరు." — విసుక్కొంటూ బయటకు నడిచాడు మధు.

"అవున్లే అది అట్లా వందమంది ఆడముండల్ని కంటుంది. వీడు వాళ్ళను నెత్తినెక్కించుకొని వూరేగుతాడు నాకెందుకు? ఏదో వీడి తర్వాత ఈ వంశం తెగులబడిపోతుందన్న దుగ్ధ తప్పించి." — సణుక్కోసాగింది శాంతమ్మ.

ఆరోజంతా మనసు మనసులోలేదు మధుకి. తిండి కూడా సహించలేదు. రాత్రి పడుకొన్న తర్వాత సావిత్రి జ్ఞాపకం వచ్చింది. పురిటికి పంపేటప్పుడు తను అన్న మాటలకు యెంత బాధపడిందో... దానికితగ్గట్టు ఆడపిల్ల పుట్టడం వలన తను ఏమంటాడో అని భయపడుతూ వుండివుంటుంది.

పోనీ ఒక్కసారి వెళ్ళి చూసివస్తే... "నువ్వేం బాధపడకు సావిత్రీ. ఆడో మొగో ఏదో ఒకటి... ఆడపిల్లయితేమాత్రమేం?... మనకేం వయసయిపోలేదుగా యింకా పిల్లలు పుట్టరనుకోడానికి. ముందు ముందు మగపిల్లవాడు పుట్టొచ్చు." — అని ఓదార్చివస్తే మంచిదని నిర్ణయించుకొన్నాడు మధు.

మరునాడు ఉదయాన్నే బయలుదేరి అత్తవారింటికి వెళ్ళేడు. అతను అనుకొన్నట్టే సావిత్రి బిడ్డను ఒళ్ళోపెట్టుకొని కంటికీమంటికీ ఏకధారగా ఏడుస్తూ కూర్చొంది.

సముదాయించేసరికి తల ప్రాణం తోకకొచ్చింది మధుకి. ఆ రోజు సాయంత్రమే మధుతో అంది సావిత్రి "మీతోనే ఈ వంశం అంతరించిపోవడం నాకు సుతరామూ యిష్టంలేదండీ... మీ సహధర్మచారిణిగా మీ క్షేమం... మీ వంశక్షేమం కోరడం నా ధర్మం... మీరు ఏమీ అనుకోకపోతే ఒక మాట చెబుతాను" — అని కళ్ళనీళ్ళు పెట్టుకొంది.

మధు మౌనంగా వుండిపోయాడు. తన భార్య ఏ విషయం చెప్పబోతోందో అతని వూహకు అందలేదు.

మళ్ళీ సావిత్రే అంది. "మీరు మరో పెళ్లి



చేసుకోండి... ఆమెద్వారానయినా పండంటి మగబిడ్డడిని కని వంశాన్ని నిలబెట్టండి''. ఆ మాటలు అంటున్నప్పుడు ఆమె స్వరం గద్గదికమయింది.

మధుకు ఆ మాటలు పిచ్చెత్తించినట్లయింది. సావిత్రిమీద విరుచుకుపడ్డాడు. ''అటువంటి మాటలనడానికి నీకు నోరెలా వచ్చింది ? నువ్వింకా బ్రతికేవున్నావుగా... నా కింకో పెళ్ళి ఎందుకు ? నేనేనాడన్నా నీతో అన్నానా రెండో పెళ్ళి చేసుకొంటానని ? అంతదాకా ఎందుకు ? పరాయి ఆడదానివంక ఎన్నడయినా కన్నెత్తి చూసి ఎరుగున్నానా ? యింకెప్పుడూ యిటువంటి మాటలనకు'' – అన్నాడు హెచ్చరిస్తున్నట్లుగా.

''అదికాదండీ... మిమ్మల్ని నొప్పించాలని నా వుద్దేశ్యం కాదు. మీతోనే ఈ వంశం నిర్వంశం అయితే ఆ పాపం నన్ను కట్టి కుడుపుతుంది. నేనా పాపం కట్టుకోలేనండీ... లేకపోతే ఏ భార్య తన భర్తను మరొక పెళ్ళి చేసుకొమ్మని చెబుతుందండీ !''–అంది సావిత్రి బావురుమంటూ.

మధు కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగేయి. ''భగవంతుడా అందరిలా నాకూ ఒక మగ నలుసు నిచ్చినట్లయితే యిన్ని తిప్పలు, యిన్ని బాధలూ వచ్చేవి కాదుకదరా !'' -- అనుకొన్నాడు.

ఆ రోజు రాత్రే బయలుదేరి వూరొచ్చేశాడు. ఇంటికి వచ్చిన దగ్గరనుండి తల్లీ తండ్రీ పోరు పెట్టడం ప్రారంభించారు మళ్ళీ పెళ్లి చేసుకొమ్మని.

''ఛస్తే చేసుకోను'' – అని ఖండితంగా చెప్పేడు మధు.

''ఒరేయ్ యిది నీ ఒక్కడి సమస్య కాదురా నువ్వే నిర్ణయించుకోడానికి. యిది మన వంశానికి సంబంధించిన సమస్య. అందులోనూ కోడలు కూడా యిష్టపడిందాయె. ఇంకెందుకురా నీకీ మొండి పట్టు ? పెళ్ళాం రెండో పెళ్ళి చేసుకొమ్మని అంటే యింకో మగాడయితే ఎగిరి గంతేసి మహారాజులా పెళ్ళి చేసుకొంటాడు. నువ్వేమో నాకు రెండో పెళ్ళి వద్దు... మొదటి పెళ్ళామే కావాలి అని మంకుపట్టు పట్టడం ఏమీ బాగోలేదు. అయిన సావిత్రి ఎక్కడకు పోతుంది ? యింట్లో నుండి గెంటివేయడం లేదుకదా ! ఆ పిల్లా యింట్లోనే వుంటుంది. హాయిగా యిద్దరు పెళ్ళాలతో కాపురం చెయ్యొచ్చు'' – అంటూ పీడించసాగేడు తండ్రి. తల్లి అయనకు వంత పాడడం మధుకు మనశ్శాంతి లేకుండా చేసింది.

''నాన్నా నేను చేస్తున్నది గవర్నమెంట్ వుద్యోగం అన్నమాట మరిచిపోవద్దు. రెండో పెళ్ళి చేసుకొంటే వున్న వుద్యోగం వూడడమే గాకుండా కటకటాల వెనక్కి తోస్తారు తెలుసా ?'' – అన్నాడు మధు.

''ఆపరా నీ తెలివితేటలు.. నేను వకీలును కనుక్కొని వచ్చేను. మొదటి పెళ్ళానికి యిష్టమైతే రెండో పెళ్ళి చేసుకొన్నా ఫరవాలేదని చెప్పేడు. ఇంకేం అభ్యంతరపెట్టకు. కుందనపు బొమ్మలాంటి చక్కని పిల్లను వెదికి పెళ్ళి చేస్తాను'' – అన్నాడు తండ్రి.

''నాన్నా నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు. నేను మరో పెళ్ళి చేసుకోను'' – అన్నాడు మధు.

నెల రోజులు గిర్రున తిరిగేయి. రెండో నెలలో భార్యను యింటికి తీసుకువచ్చాడు. అంతవరకూ తల్లీ తండ్రీ పోరుతో సతమతమవుతున్న మధు సావిత్రి పోరుకూడా భరించవల్సివచ్చింది. నాలుగు వైపులా తాకిడికి తట్టుకోలేక పునర్వివాహానికి తన అంగీకారాన్ని తెలిపేడు మధు.

ఎన్నో సంబంధాలు చూశారు. ఆఖరికి ఒక సంబంధాన్ని స్థిరపరచుకొని, నిశ్చయ తాంబూలాలు పుచ్చుకొన్నారు. ఆనాటినుండి తను భార్యకు ఏదో ద్రోహం చేస్తున్నానన్న భావం మధు మనసులో ముద్ర వేసుకుంది. కానీ, సావిత్రే అతన్ని అంతగా ప్రోత్సహించడంవలన కొంతవరకూ ఆ భావాన్ని చంపుకోగలిగేడు.

సావిత్రితో పెళ్ళయిన తర్వాత, మొదటి రాత్రి అతననుకోలేదు తన జీవితంలో మరో మొదటి రాత్రంటూ వుంటుందని. కానీ విధి చిత్రమైనది.

కాలం గిర్రున తిరిగింది. మధు రెండో భార్య వసుంధర కూడా కలుపుగోలు మనిషి కావడం వలన ఆ యింట్లో ఎవరికీ అసౌకర్యం కలుగలేదు. సావిత్రి, వసుంధర సొంత అక్కా చెల్లెళ్ళలాగా మసలుకొనేవాళ్ళు.

వసుంధరకు నెల తప్పింది. ఈ వార్త ఆ యింట్లో అందరినీ ఆనందంలో ముంచెత్తింది. అందర్లోకి ఎక్కువ సంతోషించింది సావిత్రి.

ఆనాటి నుండి వసుంధరను కాలు కూడా కింద పెట్టనివ్వకుండా అపురూపంగా చూడసాగేరు అందరూ.

వసుంధరకు వాళ్ళ ప్రవర్తన యెంతో అసౌకర్యం కల్గించినా, తప్పక వాళ్ళు చెప్పినట్టు వినవలసివచ్చింది.

నెలలు నిండుతున్నకొలదీ ఆమెను అద్దాల బీరువాలోని గాజుబొమ్మలాగా చూడసాగేరు. ''అమ్మాయ్ వారానికొకసారైనా వెళ్లి డాక్టరుకు చూపించుకో తల్లీ ... అందులోనూ యిది మొదటి కానుపాయె ... ఆడదానికి పురుడు మరో జన్మ లాంటిదంటారు. బద్ధకించకుండా మందులు జాగ్రత్తగా డాక్టరు చెప్పినట్లు వాడు.'' – అత్తగారు రోజుకు నాలుగుసార్లన్నా చెప్పేది.

''వసుంధరా ... పండంటి మగపిల్లవాడిని కని మా వంశం నిలబెట్టు తల్లీ.'' – అంటుండేవారు మామగారు.

''చెల్లాయ్ ! నీకు మగపిల్లడే పుడతాడు తప్పకుండా. అలా పుట్టాలని రోజూ భగవంతుడిని ప్రార్థిస్తున్నా'' – అనేది సావిత్రి.

''వసూ ... నాలాంటి ... పోనీ నీలాంటి మగబిడ్డను కన్నావంటే చాలు, నిన్ను ఈ జన్మలో యింకేమీ అడగను.'' – అనేవాడు మధు.

వాళ్ల మాటలకు సిగ్గుతో చిమిడిపోయేది వసుంధర. లోలోపల ఆమెకు బెదురుకూడా లేకపోలేదు.

పురిటికి పుట్టింటికి తీసుకెళ్తామని వసుంధర తల్లితండ్రులు వొచ్చినా ''ఆ ముద్దూముచ్చటా మా యింట జరగన్వండేవని'' – పట్టుబట్టారు మధు తల్లితండ్రులు. మధుకు కూడా పంపడానికి యిష్టంలేకపోయింది.

వసుంధరకు నెలలు నిండాయి. ఓ శుభ ముహూర్తాన ప్రసవించింది. అందరూ మెటర్నిటీ రూమ్‌లో నుండి ఎటువంటి వార్త వస్తుందోనని ఆతురతతో ఎదురుచూడసాగేరు.

మధు కాలుకాలిన పిల్లిలా హాస్పిటల్ వరండాలో పచార్లు చేయసాగేడు. మెటర్నిటీ రూం తలుపులు తెరచుకొన్నాయి. డాక్టరు చేతులు తుడుచుకొంటూ బయటకు వచ్చింది.

వస్తూనే ''కంగ్రాట్స్ మిస్టర్ మధూ ! యు ఆర్ బ్లెస్సిడ్ విత్ ఫిమేల్ ఛైల్డ్'' – అంది నవ్వుతూ.

నెత్తిన పిడుగు పడ్డట్టయింది మధు పరిస్థితి. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు మరో ఆడపిల్లా ... అతని మనసు బాధతో నిండిపోయింది.

సావిత్రికి నోట మాట రాలేదు. మధు తల్లితండ్రులు ఎంతో విచారించారు. ''దరిద్రుడికి ఏ రేవు కెళ్ళినా ముళ్ళపరిగెలే పడ్డాయట. అట్లా వుంది వీడి పరిస్థితి. మళ్ళీ ఆడదెయ్యమే పుట్టింది. అంతా మన ఖర్మ.'' – అంది తల్లి.

తండ్రి కూడా ఆదోరకంగా మాట్లాడేడు. మధు పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. వసుంధరను హాస్పిటల్ నుండి ఇంటికి తీసుకొచ్చారు. ఇంట్లో తల్లీ తండ్రీ సూటిపోటీ మాటలనడం మధు గమనించకపోలేదు.

కానీ తనేం చెయ్యగలడు ?

రోజులు గడుస్తున్నాయి. సావిత్రికి నెల తప్పింది. అందరి గుండెల్లోనూ రాయి పడింది, సావిత్రికి కూడా అదే నమ్మకం.

ఒకరోజు భర్తతో అంది ''ఎలాగూ నాకు ఆడపిల్లే పుడుతుందండీ, మనకేం పిల్లలు తక్కువ గనుకనా, నేను అబార్షన్ చేయించుకొంటాను.'' –

ఎక్కడినుండి విన్నదో శాంతమ్మ బాణంలా దూసుకువచ్చింది. ''అటువంటి ఆలోచనలు

[34 వ పేజీ చూడండి]

పెట్టుకోవద్దు.'' – అంటూ తిట్టింది. ఇక ఆ ఊహకు స్వస్తి చెప్పక తప్పలేదు.

నెలలు నిండాయి సావిత్రికి. ప్రసవమయ్యే సమయం దగ్గరకొచ్చింది. ఈసారి యెవ్వరూ ఏవిధమైన ఆర్భాటమూ చెయ్యలేదు. మధు కూడా పెద్దగా ఏమీ పట్టించుకోలేదు. నొప్పులు వచ్చే

## అపుత్రస్య...

[ 31వ పేజీ తరువాయి]

సమయంలో వసుంధరే సావిత్రిని హాస్పిటల్‌కు తీసుకెళ్ళి జాయిన్ చేసింది.

ఆరోజు సాయంత్రమే సావిత్రి ప్రసవించింది.

సావిత్రికి దబ్బపండులాంటి మగ పిల్లవాడు పుట్టేడు. 'ఇంకానయం అబార్షన్ చేయించుకొన్నానుకాదు' – అనుకొంది సావిత్రి.

''ఇదంతా నా ప్రజ్ఞే. ఆరోజు నేను తిట్టకపోతే ఈ మనవడు నాకు దక్కేవాడా'' – అంది శాంతమ్మ మురిసిపోతూ.




daCunha/N/2 LTel/R-1